క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం ధనిష్ట నక్షత్రం తదియ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పలు కుటుంబాలకు మండల కన్వీనర్ పరామర్శ



యద్దనపూడిలో రంగయ్యను పరామర్శిస్తున్న మండల కన్వీనర్ వేణుబాబు

యద్దనపూడి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను ఆ పార్టీ మండల కన్వీనర్ రావూరి వేణుబాబు శనివారం పరామర్శించారు. మండల కేంద్రమైన యద్దనపూడిలో యనమర్తి రంగయ్య, యనమదలలో పల్లెపోగు సాల్మన్ శస్త్ర చికిత్స చేయించుకోగా వారిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గన్నవరంలో షేక్ ఖాసింవలి అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. మాజీ ఎంపీపీ ముప్పాల రాంబాబు, నల్లపునేని లక్ష్మయ్య, నల్లపునేని వేణు, వీరేంద్ర, బొందు ప్రకాష్, పులగం సురేష్, గొర్రె సురేష్, మేడిద రామాంజి, బత్తుల అఖిల్, సన్ని తదితరులున్నారు.

అద్దంకి నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ సర్వీసు

అద్దంకి: అద్దంకి నుంచి తిరుపతికి నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ మోహనరావు శనివారం తెలిపారు. ఈ బస్సు ప్రతి రోజూ రాత్రి 8.30 గంటలకు డిపో నుంచి బయలుదేరి, ఒంగోలు కావలి, నెల్లూరు మీదుగా ఉదయం 4.30 గంటలకు తిరుపతికి చేరుతుందని తెలిపారు. తిరిగి తిరుపతిలో ఉదయం 8 గంలకు బయలుదేరి సాయంత్రం 4.15 గంటలకు అద్దంకి డిపోకు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అద్దంకి పరిసర ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజరు కోరారు.

నూతన అధ్యక్షునికి సత్కారం



నూతన గ్రామ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మండల కన్వీనర్

మేదరమెట్ల(అద్దంకి): మండలంలోని ప్రాసంగులపాడు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా ఎన్నికైన చేజర్ల బ్రహ్మయ్యను మండల పార్టీ అధ్యక్షుడు పాలపర్తి శ్రీధర్ శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

చీరాల అర్బన్: మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు ప్రోత్సహించవద్దని ట్రాఫిక్ ఎస్సై పవన్‌కుమార్ అన్నారు. శనివారం మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రిల్ నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్ పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు ఇచ్చి వారిని ప్రోత్సహించవద్దని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

చీరాల: మహిళ వద్ద నుంచి 12 షాట్ విస్కీ బాటిళ్లను శనివారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సిబ్బంది మండలంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. చీరాల మండలంలోని ఈపూరుపాలెం నుంచి దేవినూతల వెళ్లే రోడ్డులో పోతురాజు శిల వద్ద తోటవారిపాలెం దండియాకాలనీకి చెందిన పి.రోజా అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 12 షాట్ విస్కీ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో మద్యం బాటిళ్లు కలిగి ఉండటం, రవాణా చేయడం నేరమని హెచ్చరించారు.

అమ్మవారి ఆలయానికి గండం




ఆలయం వద్ద భక్తులు, వెనుకనే ఉన్న కొండ

- ప్రమాదంలో ఈర్ల గంగమ్మ ఆలయం
- గుడిపై పడుతున్న గ్రానైట్ రాళ్లు
- ఆందోళనలో భక్తులు, ఆలయ కమిటీ

బల్లికురవ: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బల్లికురవ సమీపంలోని ఈర్ల గంగమ్మ ఆలయంపై భాగంపై గ్రానైట్ వృథా రాళ్లు దొర్లి పడుతుండటంతో భక్తులు, ఆలయ కమిటీ వారు భయాందోళన చెందుతున్నారు. 12వ శతాబ్దంలో కొణిదెనను రాజులు పరిపాలించినట్లుగా చరిత్రలు చెబుతున్నాయి. కొణిదెన రెవెన్యూలోని ఈర్ల కొండకు తూర్పు భాగంలో ఓ పెద్ద బండరాయి కింద ఈర్ల గంగమ్మ అప్పట్లోనే స్వయం భూగా వెలిసింది. నాలుగు దశాబ్దాల క్రితం ఈ కొండ చుట్టూ సుమారు 30 పైగా గ్రానైట్ క్వారీలు ఏర్పడ్డాయి. నక్క బొక్కలపాడు గ్రామ సమీపంలో ఉన్న ఈ ఆలయాన్ని గ్రామస్తులు ఆలయ కమిటీ ఏర్పాటుతో అభివృద్ధి పరుచుకున్నారు. ఇటీవల కాలంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అయితే కొండ పై భాగంలో క్వారీ నిర్వహకులు రాళ్లు తీసే పనులు చేపట్టడంతో వృథా రాళ్లు దొర్లి ఆలయం పై పడుతున్నాయి. పచ్చని చెట్లతో ప్రశాంత వాతావరణంలో పాటు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారు విరాజిల్లుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు వస్తుంటారు. రాళ్లు ఆలయం పై దొర్లి పడుతుండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చేస్తున్నారు.

ఆలయ ప్రాశస్త్యం

ఈ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తుతుంటారు. ఇదే ఆలయ సన్నిధానంలో జంట నాగులతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శివపార్వతుల కుటుంబానికి చెందిన శిలలు కూడా ప్రతిష్ఠించారు. పిల్లలు లేని వారు ఇక్కడకు వచ్చి సుబ్రహ్మణ్యేశ్వరునికి, గంగమ్మకు ప్రార్థిస్తారు. సంతానం కలిగాక తమ మొక్కులు తీర్చుకుని గంగమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరుని పేర్లు కలిసేలా తమ పిల్లలకు నామకరణం చేస్తారు. అలాగే ఆషాఢమాసం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు వచ్చి అమ్మవారికి సారె సమర్పిస్తారు. అమ్మవారికి వేటలను బలులిచ్చి మొక్కు తీర్చుకుంటారు. అలాగే చిన్నారులకు పుట్టు వెంట్రుకలు, అన్నప్రాసనలు, చెవిపోగులు కుట్టే కార్యక్రమాలను అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తారు.



ఆలయంపై దొర్లిపడుతున్న గ్రానైట్ వృథా రాళ్లు



అమ్మవారికి సారె సమర్పించుకున్న భక్తులు

వృథా రాళ్లు పడవేయం ప్రమాదకరం



ఎంతో చరిత్ర గల ఈర్ల కొండమ్మ ఆలయ పై భాగంలో గ్రానైట్ నిర్వాహకులు వృథా రాళ్లను పడవేయడం చాలా బాధాకరం. కమిటీ సభ్యులమంతా గ్రానైట్ నిర్వాహకులతో మాట్లాడాలని నిర్ణయించుకున్నాం. ఆలయం వైభవానికి పాటు పడాలే తప్ప వృథా రాళ్లు పడేయడం క్షమించరాని నేరం. – బొల్లినేని కోటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యుడు

మోసానికి, వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

- అమలుకు నోచుకోని హామీలతో ప్రజలను మోసం చేశాడు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి



కారంచేడులో బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదనరెడ్డి

కారంచేడు: మోసాలకు, వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్‌గా చంద్రబాబు ఉంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూధనరెడ్డి అన్నారు. శనివారం కారంచేడులోని దగ్గుబాటి రామానాయుడు కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు షూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపులోనే ప్రజల్లో పూర్తిగా విశ్వాసం కోల్పోయిందన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమల్లో చంద్రబాబు ప్రజలను కోలుకోలేని మోసం చేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆందోళనలను తట్టుకోలేక తల్లికి వందనం అమలు చేశారన్నారు. అది కూడా పూర్తిగా అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. పర్చూరు నియోజకవర్గ మహిళావిభాగం అధ్యక్షురాలు జువ్వా కోమలి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు.

సైనికులుగా పనిచేద్దాం..

పర్చూరు నియోజకవర్గంలో రాబోవు రోజుల్లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండాను ఎగురవేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గాదె అన్నారు. అందుకు తగినట్లు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతర్గత విభేదాలను వీడి కలిసికట్టుగా పనిచేసి మన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడదామని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండా చౌదరిబాబు, బాపట్ల జిల్లా యువజన విభాగం కార్యదర్శి యార్లగడ్డ శ్రీకాంత్, పార్టీ మండల ఉపాధ్యక్షులు గోగినేని సతీష్, ముల్లా నూర్‌అహ్మద్, అనీల్, కారుమూడి సుబ్బారెడ్డి, కొడాలి దర్మానందరావు, చల్లా సుబ్బారెడ్డి, యార్లగడ్డ పాపారావు, సర్పంచ్ ఈదర సౌందర్య, ఎంపీటీసీ సభ్యులు చుక్కా రత్నకుమారి, గేరా మాణిక్యరావు, గర్నెపూడి ప్రసాద్, వెంపరాల సుబ్బారాయుడు, బట్టు అనీల్, దాసరి వెంకట్రావు, బండారు ప్రభాకరరావు, జాగర్లమూడి సందీప్, ఎస్టీ సెల్ అధ్యక్షులు మోగిలి నాగేశ్వరరావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న గాదె, నాయకులు



సమావేశానికి హాజరైన కారంచేడు కార్యకర్తలు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

కారంచేడు: వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సీజనల్ వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు చేరి అక్కడ దోమలు (లార్వా) వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ లార్వావ్యాప్తితో అనేకమైన అంటు వ్యాధులు కూడా ప్రబలుతాయన్నారు. దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవడం, వాడని తొట్లలో నీటిని తీసివేయడం, పూల మొక్కల వద్ద చెత్తా, చెదారం తొలగించుకోవడం, వాడి పడేసిన కొబ్బరి బోండాలను తొలగించుకోవడం, టీ కప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ డి. శ్రీనివాసరావు, జయశ్రీ, ఆలీష్‌కుమారి, ఆశలు పాల్గొన్నారు.

చందుకు అరుదైన పురస్కారం



భారత సేవారత్న జాతీయ అవార్డు అందుకుంటున్న గుంటుపల్లి చందు

మార్టూరు: స్థానికంగా అమ్మ అనాథ ఆశ్రమం స్థాపించి వృద్ధులు అనాథలకు సేవలు అందిస్తున్న గుంటుపల్లి చందు శుక్రవారం రాత్రి హైదరాబాదులో అరుదైన పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా సంస్థ మనం ఫౌండేషన్ 9వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా హైదరాబాదులోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో చందుకు నిర్వాహకులు భారత సేవారత్న జాతీయ అవార్డు 2025 అవార్డును అందజేశారు. గుంటు పల్లి చందు తమ ఆశ్రమం ద్వారా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, వృద్ధులకు అన్నదానం గత ఆరు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నందున ఈ పురస్కారం అందజేసినట్లు మనం ఫౌండేషన్ అధినేత డాక్టర్ చక్రవర్తి తెలిపారు.

యోగ శిక్షణ కేంద్రం ప్రారంభం



యోగ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రోటరీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యోగ శిక్షణా కేంద్రాన్ని శనివారం స్థానిక రోటరీ భవన్‌లో క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కటారి సత్యనారాయణచే ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కృష్ణమోహన్ మాట్లాడుతూ శిక్షణ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలకు యోగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖర్ రావు, పాబోలు వెంకన్న పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలతో నిఘా



దగ్గుబాడులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

దగ్గుబాడు (కారంచేడు): బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మొయిన్ సూచనలతో గ్రామాల్లో సీసీ కెమెరాలతో నిరంతర నిఘా వ్యవస్థ ప్రారంభిస్తున్నామని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. శనివారం దగ్గుబాడులో ప్రధాన రహదారిపై కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. గ్రామాల్లో కొత్త వారి కదలికలు, అనుకోని ప్రమాదాలు, దొంగల దశ్చర్యలపై నిఘా ఉంచేందుకు ఈ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు.

సమ్మెలో ఇంజినీరింగ్ కార్మికులు



నిరసన తెలియజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

అద్దంకి: ఎన్నో రోజులుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిసనలు చేస్తున్నా ప్రభుత్వం దిగిరాకపోవడంతో, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ శనివారం అర్ధరాత్రి నుంచి నిరధిక సమ్మెలోకి వెళ్లారు. దానిలో భాగంగా పట్టణ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాస్టర్ పాయింట్‌లో గేటు మీటింగ్‌లో నిరసన తెలియజేశారు. జీఓ నంబర్ 36 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత పది రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలో భాగంగా ఈరోజు గేటు మీటింగ్లో నిరసన తెలియజేసినా ఫలితం లేకపోవడతో సమ్మెలోకి వెళ్లినట్లు వారు తెలిపారు. సీఐటీయూ మండల నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉసురుపాటి శామ్యూల్, ప్రేమ్, యెహోషువ మార్కు, మారుతి, కోటేశ్వరరావు, గిరి, వడివేలు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం



కారంచేడులో వెంకటేశ్వరస్వామివారి శాంతి కల్యాణం

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో వాడరేవు–పిడుగురాళ్ళ ప్రధాన రహదారి పక్కన కొలువైన భూసమేత వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం శాంతి కాల్యాణం నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన శాంతి కల్యాణంలో దంపతులు పాల్గొని కల్యాణంను జరిపించారు.

పాస్టర్ పగడాల మరణం బాధాకరం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న 7 రెవరెండ్ అనిల్ ప్రభు

చీరాల రూరల్: దేవుని రాజ్యస్థాపనకు పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ తన జీవితాన్ని త్యాగంచేసి హతసాక్షిగా నిలిచారని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. స్థానిక పేరాల సెయింట్ మార్క్స్ బ్రాంచ్ చర్చి ఆవరణలో రెండురోజులుగా నిర్వహిస్తున్న పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభలు శనివారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ సహచరుడు పాస్టర్ ఉదయ్‌కిరణ్, స్థానిక పాస్టర్లు రెవరెండ్స్ పిల్లి దేవదాసు, పోకూరి నానిబాబు, కిరణ్‌పాల్, అనిల్ ప్రభు, మూకిరి రత్నశేఖర్ మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ కుమార్ ఆల్కాహాల్ సేవించి మృతి చెందారని.. కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అటువంటి అలవాట్లు ప్రవీణ్‌కు లేవన్నారు. ఆయన దేవుని సేవ చేయడమే కాకుండా అనాథలను చేరదీసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్ది వారి జీవితాల్లో కాంతులు నింపారని చెప్పారు. అలానే అనేకమైన సంస్థలను ఏర్పాటుచేసి కుల మతాలకు అతీతంగా ఉద్యోగాలు కల్పించడమే కాకుండా వారిని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కేవలం సంఘాలను ఏర్పాటు చేసి సేవ చేయడమే కాకుండా అన్ని రంగాల్లో సేవలు అందించాలనే తలంపులు కలిగి ఉండేవారని చెప్పారు. ప్రభువైన ఏసుక్రీస్తును ఆనాటి రోమన్‌లు శిలువవేసి చంపి క్రైస్తవ్యం ఇక భూస్థాపితం అయిందని అనుకున్నారని.. కానీ ఆయన మరణానంతరం ఆయన ఏర్పాటు చేసుకున్న కేవలం 12 మంది శిష్యులు విశ్వవ్యాప్తంగా దేవుని వాక్యాన్ని విస్తరించారని చెప్పారు. పాస్టర్ ప్రవీణ్ కుమార్ వంటి విశ్వాసిని కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. అనంతరం సభలకు హాజరైన విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. గొర్రెముచ్చు ప్రసన్న కుమార్ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంస్మరణ సభలో చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, పేరాల యూత్, చర్చి సంఘస్తులు పాల్గొన్నారు.


ఫైనాన్స్ బిల్‌ను రద్దు చేయాలి

పొదిలి: కొత్త పెన్షన్లు, పాత పెన్షన్ల మధ్య వ్యత్యాసం ఏర్పడి పాత పెన్షనర్లు నష్టపోయే ఫైనాన్స్ బిల్ 2025ను వెంటనే రద్దు చేయాలని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏ.బాదుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొదిలి తాలూకా పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక పెన్షనర్ల భవనంలో జరిగింది. ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి, యల్లమందారెడ్డి మాట్లాడుతూ 15వ తేదీన ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రహదారుల అభివృద్ధికి నిధులు

బల్లికురవ: నక్క బొక్కలపాడు – కొణిదన – రాజుపాలెం రోడ్డు, బల్లికురవ – సంతమాగులూరు రోడ్‌లో అసంపూర్తి రోడ్డు అభివృద్ధికి నాబార్డ్ నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ బాజ్జి శనివారం తెలిపారు. బల్లికురవ – సంతమాగులూరు రోడ్డులో సంతమాగులూరు గ్రామ సమీపంలో అసంపూర్తిగా నిలిచిన రోడ్డు అభివృద్ధికి రూ. 1.75 కోట్లు, నక్క బొక్కలపాడు – కొణిదన – రాజుపాలెం రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. వెట్ మిక్స్ తారుతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రాకపోకలకు ఇబ్బందులు తొలగిస్తామని వివరించారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం



మాట్లాడుతున్న మీడియేషన్ ట్రైనర్ రామకృష్ణారెడ్డి

చీరాల రూరల్: కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను మధ్యవర్తిత్వం (మీడియేషన్) అనే సులువైన మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని న్యాయవాది మీడియేషన్ ట్రైనర్ ఆసాది రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీరాం చిట్స్ కంపెనీలో మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం అనే అంశంపై కంపెనీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేశంలోని అన్ని కోర్టుల్లో పెండింగ్ కేసులను దృష్టిలో పెట్టుకుని సుప్రీం కోర్టు నూతనంగా మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి కేసును కక్షిదారులకు ఆమోదయోగ్యంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు. మీడియేషన్ ద్వారా రాజీ చేయదగిని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు. పీఎల్‌వీలు దాసరి ఇమ్మానుయేలు, మతిన్, సాయి కృష్ణ, శ్రీరాం చిట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు మండల సర్వసభ్య సమావేశం రేపు

మార్టూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 14వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు శనివారం ప్రకటనలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.